సాక్షి
శ్రీకాకుళం
మంగళవారం ◆ 4 ◆ జూన్ ◆ 2024



సేంద్రియ సాగు..
సేంద్రియసాగుపై అవగాహన పెరుగుతోంది. ఇది భూసారాన్ని కూడా పెంచుతుంది.
- 8లో



ఫ్లాట్ 101లో మృతదేహం
శ్రీకాకుళంలోని ఓ ఫ్లాట్‌లో ఓ వ్యక్తి మృతదేహం కుళ్లిపోయిన దశలో కనిపించింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.
- 8లో



కందిరీగల దాడిలో..
కందిరీగల దాడిలో 12 మంది గాయపడ్డారు. మామాడిపల్లి పంచాయతీలో ఘటన జరిగింది.
- 8లో

న్యూస్‌రీల్

'ఉచిత సీట్లకు ఎంపికైన వారు 7 లోపు చేరాలి'



కె.వెంకటేశ్వరరావు, డీఈఓ

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్/ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు రెండో విడతగా ఉచిత అడ్మిషన్లు లభించిన విద్యార్థులను ఈ నెల 7వ తేదీలోపు వారు ఎంపికైన పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన డీఈఓ కార్యాలయంలో మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాల కోసం 3,185 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా మొదటి దశలో 796 మంది విద్యార్థులను పాఠశాల విద్య ఉన్నతాధికారులు తగు అర్హతలు ఆధారంగా ఎంపిక చేశారని పేర్కొన్నారు. అలాగే రెండో విడతలో ఎంపికైన విద్యార్థుల సమాచారాన్ని సందేశాల రూపంలోను, ఎంఈఓ కార్యాలయాల నుంచి పేరెంట్స్‌కు ఫోన్లు చేయించి పంపించామని తెలిపారు. సీఎస్ఈ.ఏపీస్కూల్ఈడీయూ.ఇన్ అనే ఆన్‌లైన్ వెబ్‌పోర్టల్‌లో కూడా ఎంపికైనవారి జాబితాను పొందుపర్చినట్టు చెప్పారు. ఈనెల 7వ తేదీలోపు ఆయా పాఠశాలల్లో విద్యార్థులను చేర్చాలని తల్లిదండ్రులను కోరారు. సంబంధిత ప్రైవేటు పాఠశాలలు యాజమాన్యాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎంపికైన విద్యార్థులను చేర్చుకోవాల్సిందేనని, అడ్మిషన్ల కోసం ఎలాంటి అదనపు ఫీజులు వసూలు చేయడానికి వీల్లేదని డీఈఓ వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. అదనపు ఫీజులు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ప్రైవేటు పాఠశాలలో విద్యాహక్కు చట్టం ప్రకారం అడ్మిషన్లు పూర్తిచేసిన విద్యార్థుల వివరాలతో ఒక రిజిస్టర్‌ను నిర్వహించాలని ఆయన సూచించారు.

కౌంటింగ్‌కు పటిష్ట భద్రత



కళాశాల మ్యాప్ ఆధారంగా భద్రతా చర్యలు వివరిస్తున్న ఎస్పీ రాధిక

ఎచ్చెర్ల క్యాంపస్: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ మంగళవారం జరుగుతున్న నేపథ్యంలో చిలకపాలేంలోని శ్రీ శివానీ గ్రూప్ కళాశాలల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ జీఆర్ రాధిక తెలిపారు. కౌంటింగ్ కేంద్రం, పరిసర ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు, సిబ్బందికి శివానీ కళాశాలలో సోమవారం పలు సూచనలు చేశారు. కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించే ప్రతి ఒక్కరినీ గుర్తింపు కార్డు పరిశీలించాలి, సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, నిషేధిత వస్తువులు క్షుణ్ణంగా తనిఖీ చేసి విడిచి పెట్టాలని సూచించారు.

10 నుంచి 16వ బ్యాచ్ ప్రారంభం



ఎ.విజయ్‌కుమార్
జిల్లా ప్రజారవాణా అధికారి

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో ఈ నెల 10వ తేదీ నుంచి ఆర్టీసీ హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ కార్యాలయ ఆవరణలో ఆయన మాట్లాడారు. ఆర్టీసీ హెవీ వెహికల్ డ్రైవింగ్‌పై ఈనెల 10వ తేదీ నుంచి 16వ బ్యాచ్ ప్రారంభం అవుతుందన్నారు. ఇప్పటి వరకూ 15 బ్యాచ్‌లు పూర్తి చేసుకోవడం జరిగిందన్నారు. శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరు కూడా సర్టిఫికెట్‌తో పాటు హెవీ లైసెన్స్‌ను కూడా తీసుకున్నారని తెలిపారు. మారుతున్న డ్రైవింగ్ విధానాలకు అనుగుణంగా మంచి అనుభవం కలిగిన ఇన్‌స్ట్రక్టర్లతో ఆర్టీసీలో హెవీ వెహికల్ డ్రైవింగ్‌పై అత్యుత్తమ శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. ఆర్టీసీలో శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరికీ, ఆర్టీసీతో పాటు మిగతా ప్రభుత్వ శాఖలలో కూడా డ్రైవర్ ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతి బ్యాచ్‌కు 16మంది అభ్యర్థులు మాత్రమే ఉంటారని, లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్, ఒక సంవత్సరం అనుభవం కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 40రోజుల శిక్షణతో పాటు మెకానికల్ వర్క్స్, విడిభాగాలు, యోగ, వ్యక్తిత్వ వికాసం, రోడ్డు ట్రాఫిక్ రూల్స్ తదితర వాటిపై శిక్షణ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఫీజు, ఇతర వివరాల కోసం 9963091999, 7382923293 నంబరుకు సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.



కౌంటింగ్‌కు సిద్ధంగా ఉన్న కేంద్రం

గెలుపు పిలుపునకు సిద్ధం

- నేడే సార్వత్రిక ఎన్నికల ఓట్ల కౌంటింగ్
- తేలనున్న 86 మంది భవితవ్యం
- 22 రోజుల నిరీక్షణకు నేటితో తెర
- ఈవీఎంల నుంచి బయటికి రానున్న ఫలితాలు
- మరికొన్ని గంటల్లో తేలనున్న విజేతలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

వారాలు రోజులుగా మారాయి. రోజులు గంటలుగా మారిపోయాయి. గంటలు క్షణాలుగా మారబోతున్నాయి. ఎన్నికల ఫలితాల ఉత్కంఠ తార స్థాయికి చేరింది. ఓటరు దేవుళ్లు ఇచ్చిన నిర్ణయం ఈ రోజే తేలిపోనుంది. నరాలు తెగే ఉత్కంఠకు తెరపడనుంది. మే 13న అసెంబ్లీకి, లోకసభ స్థానాలకు పోలింగ్ నిర్వహించారు. 22రోజులు ఉత్కంఠకు నేడు తెర పడనుంది. జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు 73 మంది, శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గానికి 13మంది అభ్యర్థులు ఎన్నికల్లో తలపడ్డారు. ఎవరితో పొత్తు లేకుండా వైఎస్సార్‌సీపీ బరిలో నిలిచింది. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుతో కూటమి బరిలో దిగింది. ఈ రసవత్తరమైన పోరులో విజేతలు ఎవరో మరికొన్ని గంటల్లో వెల్లడి కానుంది.

గతం కంటే పెరిగిన పోలింగ్

ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ తదితర రాజకీయ పక్షాలు సర్వశక్తులు ఒడ్డాయి. ఆ పార్టీ అధినేతలు వ్యూహ ప్రతి వ్యూహాలు, ఎత్తులకు పైఎత్తులు వేశారు. మండుటెండలను సైతం లెక్క చేకుండా ప్రచారాలు నిర్వహించారు. ఎన్నికల కోసం అహర్నిశలు కష్టపడ్డారు. తమకు అనుకూలంగా ఓటింగ్ జరిగేలా, ఓటర్లను విధేయులుగా చేసుకునేందుకు విశ్వప్రయత్నాలు చేశారు. మొత్తానికి నేతల ప్రయత్నం ఫలించింది. జిల్లా చరిత్రలో ఎన్నడూలేని విధంగా పోలింగ్ జరిగింది. 2019 ఎన్నికల్లో 75.53 శాతం శాతం పోలింగ్ జరగ్గా ఈ సారి రికార్డు స్థాయిలో 76.81శాతం పోలింగ్ నమోదైంది. ఒక్క నియోజకవర్గం తప్ప మిగతా అన్ని నియోజకవర్గాల్లో పోలింగ్ పెరిగింది. జిల్లాలో 18,75,934 మంది ఓటర్లకు గాను 14,17,959 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 6,86,120మంది ఉండగా, మహిళలు 7,31,822 మంది ఉన్నారు. ఇతరులు 17మంది ఉన్నారు. ఈ పెరిగిన పోలింగ్ ఎవరికి వారే తమ అనుకూలంగా ఉంటుందని వారి వారి ఖాతాల్లో వేసుకుంటున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలే పోలింగ్ స్టేషన్‌కు ఓటర్లను తీసుకొచ్చిందని అధికార పార్టీ నమ్ముతోంది.

పోటీ వీరి మధ్యే..

జిల్లాలో ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు 73 మంది, పార్లమెంట్‌కు 13 మంది పోటీ చేసినప్పటికీ ప్రధాన పోటీ వైఎస్సార్ సీపీ, కూటమి మధ్యే జరిగింది.

- **శ్రీకాకుళం** పార్లమెంట్‌కు వైఎస్సార్‌సీపీ తరపున పేరాడ తిలక్, టీడీపీ తరపున కింజరాపు రామ్మోహన్‌నాయుడుతో పాటు మరో 11 మంది బరిలో నిలబడ్డారు.
- అసెంబ్లీ వారీగా చూస్తే **ఇచ్ఛాపురం** నుంచి వైఎస్సార్‌సీపీ తరపున పిరియా విజయ, టీడీపీ తరపున బెందాళం అశోక్, మరో ఏడుగురు బరిలో ఉన్నారు.



పోలింగ్ సందర్భంగా పోలీసులకు దిశానిర్దేశం చేస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

కట్టుదిట్టమైన బందోబస్తు..

పోలీసు సిబ్బంది కూడా విధుల్లో నిరంతరాయంగా పనిచేసేందుకు సిద్ధమవుతున్నారు. ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకుంటాయన్న అనుమానంతో సంఘ విద్రోహ శక్తులు, రౌడీ షీటర్లు, డెకాయిట్లు అల్లర్లకు పాల్పడే వారిపై నిఘా పెట్టారు. పోలీసు ఆంక్షలను ధిక్కరించిన వారిని ఉపేక్షించేది లేదని ఇప్పటికే పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు. కౌంటింగ్ ప్రశాంతంగా పూర్తయ్యి, ఫలితాలు వెల్లడయ్యేంతవరకు జిల్లా వ్యాప్తంగా 1459 మంది పోలీసులు బందోబస్తులో నిమగ్నం కానున్నారు. లెక్కింపు కేంద్రం వద్ద మూడంచెల భద్రతలో భాగంగా కేంద్ర బలగాలు, జిల్లా ఆర్మ్‌డ్ ఫోర్స్, సివిల్ పోలీసులును నియమించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 288, జిల్లా వ్యాప్తంగా 536 కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి ప్రతి నిమిషం పర్యవేక్షించనున్నారు. కౌంటింగ్ సెంటర్ వద్ద మెటల్ డిటెక్టర్లు ఏర్పాటు చేశారు. ప్రతి వ్యక్తిని క్షుణ్ణంగా పరిశీలించాక, ఎన్నికల సంఘం ఇచ్చిన గుర్తింపు కార్డు ఉంటేనే లోపలికి పంపిస్తారు. జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. సెక్షన్ 30 కూడా అమల్లోకి తెచ్చారు. ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకునే అవకాశం ఉన్న ప్రాంతాల్లో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశారు.

తొలి ఫలితం ఆమదాలవలస తుది ఫలితం పాతపట్నం

ఎన్నికల ఫలితాల్లో తొలుత ఆమదాలవలస నియోజకవర్గం ఫలితం వస్తుంది. జిల్లాలో తక్కువ పోలింగ్ బూత్‌లు(259) ఉన్న ఆమదాలవలస నియోజకవర్గం ఓట్ల లెక్కింపు 14టేబుళ్లపై 19రౌండ్లలో పూర్తవుతుంది. పాతపట్నంలో అత్యధికంగా 323 పోలింగ్ బూత్‌లు ఉండటంతో 14 టేబుళ్లపై లెక్కింపు పూర్తయ్యేసరికి 24 రౌండ్లు పట్టనుంది. ఈ ఫలితం చివరిది కానుంది. తొలి, తుది ఫలితాల మధ్యలో శ్రీకాకుళం, పలాస, నరసన్నపేట, ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల, టెక్కలి నియోజకవర్గ ఫలితాలు వెల్లడి కానున్నాయి.

- **పలాస** నుంచి వైఎస్సార్‌సీపీ తరపున సీదిరి అప్పలరాజు, టీడీపీ తరపున గౌతు శిరీష, మరో ఏడుగురు
- **టెక్కలి** నుంచి వైఎస్సార్‌సీపీ తరపున దువ్వాడ శ్రీనివాస్, టీడీపీ నుంచి కింజరాపు అచ్చెన్నాయుడు, మరో ఐదుగురు
- **పాతపట్నం** నుంచి వైఎస్సార్‌సీపీ తరపున రెడ్డి శాంతి, టీడీపీ తరపున మామిడి గోవిందరావు, మరో ఏడుగురు
- **శ్రీకాకుళం** నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ తరపున ధర్మాన ప్రసాదరావు, టీడీపీ తరపున గొండు శంకర్, మరో ఐదుగురు
- **ఆమదాలవలస** నుంచి వైఎస్సార్‌సీపీ తరపున తమ్మినేని సీతారాం, టీడీపీ తరపున కూన రవి కుమార్, మరో 11మంది
- **ఎచ్చెర్ల** నుంచి వైఎస్సార్‌సీపీ తరపున గొర్లె కిరణ్ కుమార్, బీజేపీ తరపున ఎన్.ఈశ్వరరావు, మరో ఏడుగురు
- **నరసన్నపేట** నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ తరపున ధర్మాన కృష్ణదాస్, టీడీపీ తరపున బగ్గు రమణమూర్తి, మరో ఐదుగురు బరిలో నిలిచారు.

ఒక్కో నియోజకవర్గంలో 14 టేబుళ్లపై లెక్కింపు

ఓట్ల లెక్కింపు జరగనున్న శివాని ఇంజనీరింగ్ కళాశాలలో భారీ ఏర్పాట్లు చేశారు. అటు లెక్కింపునకు, ఇటు శాంతిభద్రతలను అదుపులో ఉంచేందుకు యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తమై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంది. 17 కౌంటింగ్ గదుల్లో 19 నుంచి 24 రౌండ్లలో లెక్కింపు చేసేందుకు 2000 మంది సిబ్బంది నిమగ్నం కానున్నారు. ఈవీఎంలను లెక్కించేందుకు 112 టేబుళ్లను ఏర్పాటు చేయగా, పోస్టల్ బ్యాలెట్‌లను లెక్కించేందుకు 29 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పార్లమెంట్ నియోజకవర్గం ఈవీఎంల లెక్కింపునకు 98 టేబుళ్లు, పోస్టల్ బ్యాలెట్ లెక్కించేందుకు 30 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్‌తో లెక్కింపు ప్రారంభం కానుంది. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాల పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభమైన అరగంట తర్వాత ఈవీఎంల లెక్కింపు మొదలు కానుంది. ఈవీఎంల లెక్కింపు అన్ని రౌండ్లు పూర్తయిన తర్వాత లాటరీ విధానంలో నియోజకవర్గంలో ఐదు వీవీప్యాట్‌ల్లోని స్లిప్‌లను లెక్కిస్తారు. అంతా పూర్తయ్యాక కేంద్ర ఎన్నికల కమిషన్‌కు తెలియజేసిన తర్వాత అధికారికంగా వెల్లడిస్తారు. వీవీప్యాట్ యంత్రాల్లో స్లిప్పులు లెక్కించడానికి సమయం పట్టనుంది. ఈ నేపథ్యంలో ఫలితాల వెల్లడికి ఆలస్యమైనా ఈవీఎంలు లెక్కించిన తర్వాత అనధికారికంగా ఫలితం తెలుస్తుంది. జిల్లాలో ఈవీఎంల ద్వారా 14,17,959ఓట్లు పోలవ్వగా, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 25,826 ఓట్లు పోలయ్యాయి.

జిల్లా వ్యాప్తంగా బందోబస్తులో పోలీసులు 1459

జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్, సెక్షన్ 30 కూడా అమల్లో ఉంది.

కెమెరాలు
కౌంటింగ్ కేంద్రాల వద్ద 288
జిల్లా వ్యాప్తంగా కూడళ్లలో 536

జిల్లాలో ఈవీఎంల ద్వారా పోలైన ఓట్లు 14,17,959

పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోలైన ఓట్లు 25,826

కౌంటింగ్ గదులు 17

రౌండ్లు 19 నుంచి 24

లెక్కింపు సిబ్బంది 2000

ఈవీఎంలను లెక్కించేందుకు ఏర్పాటు చేసిన టేబుళ్లు 112

పోస్టల్ బ్యాలెట్ లెక్కించేందుకు ఏర్పాటు చేసిన టేబుళ్లు 29

పార్లమెంట్ నియోజకవర్గం ఈవీఎంల లెక్కింపునకు ఏర్పాటు చేసిన టేబుళ్లు 98

పోస్టల్ బ్యాలెట్ లెక్కించేందుకు ఏర్పాటు చేసిన టేబుళ్లు 30

కౌంటింగ్ ప్రారంభమయ్యే సమయం ఉదయం 8 గంటలు

జిల్లాలోని 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య: 73

పార్లమెంట్ నియోజకవర్గ బరిలో ఉన్న అభ్యర్థుల సంఖ్య: 13

సిబ్బందికి సంపూర్ణ శిక్షణ



కౌంటింగ్ డ్రైవ్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల లెక్కింపుపై సిబ్బందికి తగిన సంపూర్ణ శిక్షణ ఇచ్చామని, పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ వంటి కీలక అంశాలపై స్పష్టమైన సూచనలు జారీ చేశామని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ చెప్పారు. సోమవారం ఉదయం జిల్లాలో గల అన్ని నియోజకవర్గాలకు నియమించిన మైక్రో అబ్జర్వర్లకు, కౌంటింగ్ సిబ్బందికి శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో ఓట్ల లెక్కింపుపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ డ్రైవ్ రన్ సందర్భంగా ఓట్ల లెక్కింపుపై పలు సందేహాలకు సమాధానాలను తెలియజేశామన్నారు.

పొరపాట్లకు తావు లేదు: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రక్రియపై పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ అధికారులకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన బ్యాలెట్ లెక్కింపుపై సంబంధిత అధికారుల వద్ద వెళ్లి సమాధానాలు రాబట్టారు. వారి సందేహాలు నివృత్తి చేశారు.




పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు శిక్షణను పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

వాహనాల రాకపోకలకు ఆంక్షలు

శ్రీకాకుళం క్రైమ్ : నేడు జరగనున్న ఎన్నికల ఓట్ల లెక్కింపు నేపథ్యంలో వాహనాల రాకపోకలకు సంబంధించి పలు ఆంక్షలు విధించారు. ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రానికి హాజరయ్యే కౌంటింగ్ సిబ్బంది, ఏజెంట్లు, అభ్యర్థుల ప్రవేశాలకు సంబంధించి, ఇతర ఏర్పాట్లపై ఎస్పీ రాధిక పలు సూచనలు చేస్తూ సోమవారం రాత్రి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు సాధారణ ప్రయాణికుల వాహనాలను శివానీ కళాశాల దగ్గరలోని పై వంతెన కింద ఉన్న అండర్ పాస్ నుంచి చిలకపాలెం వైపునకు సర్వీసు రోడ్డు మీదుగా పంపుతారు. లెక్కింపు ప్రక్రియ ముగిసిన అనంతరం కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్ల వాహనాలు చిన్నరావుపల్లి రోడ్డు మీదుగా అజరాం అండర్‌పాస్ నుంచి వెళ్తూ జాతీయ రహదారి మీదుగా శ్రీకాకుళం వెళ్లాల్సి ఉంటుంది.

'బాధ్యతగా పనిచేయాలి'



శిక్షణలో మాట్లాడుతున్న పరిశీలకులు శేఖర్ విద్యార్థి

శ్రీకాకుళం పాతబస్టాండ్: సార్వత్రిక ఎన్నికల్లో ఓట్లను లెక్కించే ప్రక్రియలో సూక్ష్మ పరిశీలకులు నిర్వర్తించే పాత్ర అత్యంత కీలకమని, సాధారణ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను శాంతియుతంగా నిర్వహించేందుకు కలిసికట్టుగా పని చేయాలని పరిశీలకులు శేఖర్ విద్యార్థి ఆదేశించారు. స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో సోమవారం సార్వత్రిక ఎన్నికలు-2024 నేపథ్యంలో జూన్ 4వ తేదీన నిర్వహించనున్న లెక్కింపు ప్రక్రియపై రెండో విడత సూక్ష్మ పరిశీలకుల శిక్షణ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పరిశీలకులు శేఖర్ విద్యార్థి, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్‌తో కలసి తలత్ పర్వేజ్ ఇక్బాల్ రోహీల్, మాలతుస్ ఎస్ సంగమ్, అనుజ కుమార్ దాస్, అశోక్ కుమార్, ఎస్.సంగీత, అజీజ్ శుక్లదాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరిశీలకులు శేఖర్ విద్యార్థి మాట్లాడుతూ సూక్ష్మ పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులు పోలింగ్ రోజు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారు. ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

కౌంటింగ్‌కు సర్వం సిద్ధం

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీ శివానీ గ్రూప్ ఆఫ్ కాలేజ్‌లో సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు పూర్తిస్థాయి ఏర్పాట్లు చేశారు. జిల్లాలో శ్రీకాకుళం, ఎచ్చెర్ల నియోజకవర్గాల కౌంటింగ్ గేట్-1 శ్రీ శివానీ ఫార్మశీ కళాశాలలో ఏర్పాటు చేశారు. ఇచ్ఛాపురం, పలాస , టెక్కలి, పాతపట్నం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గ కౌంటింగ్ కేంద్రాలు గేట్-3 రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం అద్దె శివానీ క్యాంపస్‌లో ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లో రాజకీయ పార్టీలు ఏజెంట్లు, స్టాఫ్ వెళ్లేందుకు రెండు మార్గాలు ఏర్పాటు చేశారు. గేట్ -1, గేట్ -2 ద్వారా ప్రవేశించాల్సి ఉంటుంది. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల కౌంటింగ్, ఉదయం 8.30 గంటలకు ఈవీఎంల కౌంటింగ్ ప్రారంభం కానుంది. సెల్‌ఫోన్‌లు గేటు వద్ద డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. క్షుణ్ణంగా తనిఖీలు చేసి లోపలకు విడిచి పెడతారు. కళాశాల యాజమాన్య సిబ్బందికి, టెక్నికల్ సిబ్బందికి సైతం అధికారులు పాస్‌లు మంజూరు చేశారు. జాతీయ రహదారిపై కింతలి మిల్లు నుంచి సర్వీస్ రోడ్డులోకి ప్రవేశించి, చిలకపాలెం ఫ్లై ఓవర్ వంతెన కింద నుంచి ఏజెంట్లు స్టాఫ్ కౌంటింగ్ కేంద్రాలకు చేరాల్సి ఉంటుంది. కళాశాల వెనుక నుంచి రోడ్లు వేశారు. నియోజకవర్గాల వారీగా ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేశారు. అల్పాహారం, భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు.అభ్యర్థులకోసం సైతం ప్రత్యేక మార్గం, బైక్‌లు, కార్లు వంటి వాహనాలు విభజించి పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశారు.



నియోజక వర్గాల గేట్లుకు వెళ్లే మార్గం సూచిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



నియోజక వర్గాలు వారీ ఏర్పాటు చేసిన ఫుడ్ కోర్టు

క్లుప్తంగా

మహాత్మా మన్నించు..



మందస మండలం నల్లబొడ్లూరు గ్రామంలో గాంధీ విగ్రహానికి తాళ్లు, విద్యుత్ తీగలు

కాశీబుగ్గ: మందస మండలం నల్లబొడ్లూరు గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద మహాత్మా గాంధీ విగ్రహానికి విద్యుత్ తీగలు, తాళ్లను చుట్టి అవమానపరుస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో ఎవరి పర్యవేక్షణ లేకపోవడంతో పరిస్థితి ఇలా మారింది. అధికారులు స్పందించి పరిస్థితి సరిదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

కొత్తమ్మతల్లి హుండీ ఆదాయం లెక్కింపు

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మ తల్లి హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం సోమవారం దేవదాయ శాఖాధికారులు చేపట్టారు. 71 రోజులకుగాను 7హుండీల ద్వారా వచ్చిన ఆదాయాన్ని లెక్కింపు చేపట్టగా రూ.4,92,883ల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వాచకచర్ల రాధాకృష్ణ తెలిపారు. శ్రీకాకుళం దేవదాయ శాఖాధికారి జీవీబీఎస్ రవికుమార్, స్థానిక ఆంధ్రా బ్యాంకు సిబ్బంది పర్యవేక్షణలో లెక్కింపు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి పాల్గొన్నారు.

10న శ్రీముఖలింగం దేవాలయ భూముల వేలం

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగం దేవాలయ భూములు సాగు(కౌలు)వేలం ఈ నెల పదో తేదీన కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నామని ఆలయ ఈఓ పి.ప్రభాకర రావు సోమవారం ప్రకటనలో తెలిపారు. శ్రీముఖలింగం దేవాలయ పరిధి 29.99 ఎకరాలకు గానూ 2024–2027 మూడేళ్లు సాగు చేసేందుకు ప్రథమ ధరావత్తు కింద రూ.30 వేలు చెల్లించాలన్నారు. అలాగే రూ.ఒక లక్షకు సాల్వెన్సీ ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు. అలాగే ఆలయ పరిధిలోగల రాధా గోవిందస్వామి మఠం భూములు 58.22 ఎకరాలకు కౌలు వేలం ఈ నెల 11న నిర్వహించనున్నామని, ఈ వ్యవసాయ భూములు కూడా మూడేళ్ల కాలపరిమితికి వేలం వేస్తామన్నారు. దీనికి ధరావత్తు రూ.25 వేలు చెల్లించాలన్నారు. పాటలో కౌలు హక్కు పొందిన రైతు ఒక ఏడాది నగదు ముందుగా చెల్లించి సాగు చేసుకునేందుకు అనుమతులు తీసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు ఆలయ ఈఓను కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సేంద్రియ సాగు.. భూమికి బాగు



సేంద్రియ ఎరువులకు అవసరమైన నీలామృతం తయారు చేస్తున్న సిబ్బంది

- రసాయనాల జోలికి వెళ్లకుండా ఎరువుల తయారీ
- తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు
- ఆహార పంటల సామర్థ్యం పెంపు

ఇచ్ఛాపురం రూరల్: భూమికి సారం.. పంటకు బలం.. రైతుకు ఆదాయం.. అందరి ఆకాంక్ష ఇదే. ఈ దిశగానే రైతు సాధికార సంస్థ జిల్లా స్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తోంది. సేంద్రియ వ్యవసాయం పేరిట ప్రకృతికి అనుగుణంగా వ్యవసాయం చేయాలంటూ విస్తృత ప్రచారం చేస్తోంది. ప్రకృతిని కాపాడుతూ జీవ వైవిధ్యాన్ని పెంపొందింపజేయడం, పంటలు, పశు పోషణను సమన్వయం చేయడం, తక్కువ పెట్టుబడితో వ్యవసాయ పద్ధతులను అమలు చేసి లాభాలు పొందేందుకు దోహదపడటం ఈ సంస్థ ప్రధాన ఉద్దేశం. మూస ధోరణిలో చేస్తున్న వ్యవసాయానికి స్వస్తి పలికి, రసాయనాల జోలికి వెళ్లకుండా సహజ సిద్ధమైన సేంద్రియ విధానంలో పంటలు పండిస్తూ, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధిస్తున్నట్లు రైతు సాధికార సంస్థ సభ్యులు చెబుతున్నారు. ఆవుపేడ, వేపాకు, ఆవు మూత్రం, జామ, సీతాఫలం, కానుగ, వావిలాకు, పొగాకు, మట్టి వంటి వాటిని సేకరించి నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం, అజ్ఞాస్త్రం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వంటి ఎరువులు తయారు చేస్తున్నారు.

ఆదర్శంగా దాలయ్య సాగు..

ఇచ్ఛాపురం మండలం పాయితారి గ్రామానికి చెందిన సప్పట దాలయ్య తనకున్న ఎకరం పొలంలో సేంద్రియ పద్ధతిలో కూరగాయలు, వరి పంటను సాగు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఐసీఆర్పీ కుమారీ సూచనల మేరకు ఇరవై సెంట్లలో ఏటీఎం మోడల్‌గా 365 రోజులూ కూరగాయలు పండిస్తున్నాడు. ఎలాంటి రసాయనాలు ఉపయోగించకుండా వరి పంట కూడా సాగు చేస్తున్నాడు.

లాభదాయకంగా కూరగాయల సాగు..

ప్రస్తుతం యూరియా, పురుగు మందులు వంటి ధరలు పెరగడంతో పాటు వాతావరణం అనుకూలించకపోవడంతో గత కొంత కాలంగా పంటలు పండించకుండా ఉండిపోయానని, ప్రకృతి వ్యవసాయం మూలంగా మళ్లీ పంటలు పండించడం మొదలు పెట్టానని మహిళా రైతు లోపింటి సరస్వతి చెబుతున్నారు. రైతు సాధికార సంస్థకు చెందిన సిబ్బంది ప్రకృతి వ్యవసాయం పట్ల అవగాహన కల్పించడంతో సేంద్రియ ఎరువుల తయారుచేసుకుని రెండేళ్లుగా పది రకాల కూరగాయలు పండిస్తూ లాభాలు పొందుతున్నట్లు చెబుతోంది.

సేంద్రియ పద్ధతిలో వరి..

తనకు ఉన్న రెండు ఎకరాల పొలంలో కేవలం సేంద్రియ ఎరువులను మాత్రమే ఉపయోగించి వరి పంటను పండిస్తుంటానని పాయితారికి చెందిన వలపల రమణ చెబుతున్నాడు. ప్రకృతి వ్యవసాయంపై అధికారులు శిక్షణ ఇవ్వడంతో తన పంట పొలాన్నే వ్యవసాయ క్షేత్రంగా మార్చి ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, బ్రహ్మాస్త్రం వంటి సేంద్రియ ఎరువులను సొంతంగా తయారు చేసుకొని ఏడాదికి రెండుసార్లు వరి పంట పండిస్తున్నానని చెప్పారు.



సేంద్రియ ఎరువులతో దాలయ్య పండించిన ముల్లంగి పంట

అధిక దిగుబడులు..



సేంద్రియ ఎరువులను రైతులు విరివిగా వాడుకోవచ్చు. పెట్టుబడి ఖర్చు తగ్గి సాధారణం కంటే సుమారు 10 నుంచి 15 శాతం ఆరోగ్యకరమైన పంట దిగుబడి పెరుగుతోంది. 18 నుంచి 32 రకాల నవధాన్యాలను ప్రత్యేకంగా తయారు చేసి ఎరువుల కిట్టుగా కిలో నామమాత్రం ధర కేవలం రూ.70కే రైతులకు విక్రయిస్తున్నాం. ఇవి అన్ని రైతు భరోసా కేంద్రాలకు అవసరం మేరకు సరఫరా చేస్తున్నాం. మా సిబ్బంది వద్ద కూడా లభిస్తున్నాయి.

– మద్దిలి చిట్టిబాబు, యూనిట్ ఇన్‌చార్జి, ప్రకృతి వ్యవసాయం

రైతులకు అవగాహన..



జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఐసీఆర్పీలుగా పనిచేస్తున్నాం. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు గ్రామాల్లో లభించే వనరులతో సేంద్రియ ఎరువులను తయారు చేసే విధానంపై శిక్షణ ఇస్తున్నాం. వీటి ద్వారా పంట ఆరోగ్యకరంగా ఉండటంతో పాటు 15 శాతం దిగుబడి పెరుగుతుంది. పంట పెట్టుబడి భారం తగ్గుతుంది.

– కందాల కుమారీ, ఐసీఆర్పీ, ప్రకృతి వ్యవసాయం

1900 లీటర్ల పులిసిన బెల్లం ఊట ధ్వంసం

కొత్తూరు: కొత్తూరు మండలం ఇరపాడు కొత్తగూడ గిరిజన గ్రామం సమీపం కొండ ప్రాంతంలో నాటు సారా తయారీ బట్టీలపై సోమవారం స్థానిక సెబ్ స్టేషన్ సీఐ బి.జయరాం రెడ్డి తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. దాడుల్లో నాటు సారా తయారీకి ఉపయోగించే 1900 లీటర్ల బెల్లం ఊటలు ధ్వంసం చేసినట్లు సీఐ చెప్పారు. 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నాటుసారాకు ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సెబ్ జాయింట్ డైరెక్టర్ డి.గంగాధర్ ఆదేశాలు మేరకు దాడులు నిర్వహించినట్లు చెప్పారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ కె.శ్రావణి, సిబ్బంది పాల్గొన్నారు.



నాటుసారా సామగ్రిని స్వాధీనం చేసుకున్న సెబ్ సీఐ జయరాం రెడ్డి సిబ్బంది

కేబుల్ వైర్లు దగ్ధం



కేబుల్ వైర్లు కాలి చెలరేగుతున్న మంటలు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని కిమ్స్ ఆస్పత్రి సమీపంలోని భైరివానిపేట కూడలి వద్ద కేబుల్ వైర్లు కాలి చిన్నపాటి అగ్నిప్రమాదం సంభవించింది. అగ్నిమాపక శాఖ అధికారులు చెప్పిన వివరాల మేరకు.. భైరివానిపేట కూడలిలో ఉన్న విద్యుత్ స్తంభానికి జియో ఫైబర్ నెట్ కేబుళ్లు చుట్టి ఉంచారు. అనుకోకుండా కింద ఎర్త్ అవ్వడంతో పైన కేబుల్ వైర్లకు మంటలు అంటుకున్నాయి. అప్పటికే అగ్నిమాపక సిబ్బంది చేరి మంటలను అదుపు చేశారు. నష్టం పెద్దగా ఏమీ లేదని ఫైర్ విభాగం కానిస్టేబుల్ షణ్ముఖ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మూడు గేదెలు మృతి

టెక్కలి రూరల్: మండలంలోని అయోధ్యపురం గ్రామ సమీప జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని మూడు గేదెలు మృతి చెందాయి. టెక్కలి గొల్లవీధికి చెందిన కూస పెంటయ్య అనే పాడి రైతు తన గేదెలను మేతకు తీసుకువెళ్లి తిరిగి ఆదివారం రాత్రి వస్తుండగా ఒక్కసారిగా వర్షం పడటంతో మంద నుంచి మూడు గేదెలు తప్పిపోయి సమీప జాతీయ రహదారి పైకి వెళ్లిపోయాయి. అయితే తప్పిపోయిన మూడు గేదెలను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో మూడు గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. అయితే వాటి విలువ సుమారు రూ.1.50లక్షలు వరకు ఉంటుందని రైతు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల గ్రామం సమీపంలో పాత జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లింగాల సురేష్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ఆయన బైక్‌పై చిలకపాలెం వైపు వెళ్తుండగా, శ్రీకాకుళం వైపు వస్తున్న లారీ ఢీ కొట్టింది. గాయపడిన వ్యక్తిని శ్రీకాకుళం రిమ్స్‌కు 108 వాహనంలో తరలించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ దుర్మరణం



కృష్ణారావు (ఫైల్)

ఎచ్చెర్ల: లావేరు మండలం సుభద్రాపురం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా గరివిడి మండలం శివరాం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గవిడి కృష్ణారావు(62) దుర్మరణం చెందారు. ఈయన ద్విచక్ర వాహనంతో వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. కృష్ణారావు మృతదేహం గుర్తు పట్టలేనంతగా నుజ్జునుజ్జు అయింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్ ఆస్పత్రికి తరలించినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. మృతుడు కృష్ణారావు వైఎస్సార్‌సీపీ నాయకుడు. ఈయన కుమారుడు గవిడి శ్రీధర్ ప్రస్తుతం శివరాం సర్పంచ్‌గా వ్యవహరిస్తున్నారు.

'ముసురు'కుంటున్న వ్యాధులు

సీతంపేట: గత కొద్ది రోజులుగా పార్వతీపురం మన్యం జిల్లాలో వ్యాధులు 'ముసురు'కుంటున్నాయి. ఇటీవల వరకు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదుకావడం, తాజాగా వర్షాలు కురుస్తుండడంతో వాతావరణం ఒక్కసారి మారింది. జ్వరాలు వ్యాప్తిచెందుతున్నాయి. వైరల్, మలేరియా, టైఫాయిడ్ జ్వరాల భారిన పడేవారంతా ఆస్పత్రులకు చేరుకుంటున్నారు. సీతంపేట ఏరియా ఆస్పత్రికి సోమవారం రోగుల తాకిడి పెరిగింది. 108 వాహనాల్లో ఆస్పత్రికి చేరుకుంటున్నారు. ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు చేసి మెరుగైన సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో మందులన్నీ అందుబాటులో ఉన్నాయని, రక్త పరీక్షలు చేసి తగిన వైద్యసేవలు అందిస్తున్నట్లు ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు. జ్వరాలతో బాధపడే వారు నిర్లక్ష్యం చేయకుండా వైద్యసేవలు పొందాలని కోరారు.



సీతంపేట ఏరియా ఆస్పత్రిలో ఓపీ విభాగం వద్ద రోగుల తాకిడి

'స్టార్టప్‌లపై దృష్టి సారించాలి'



అధ్యాపకుల శిక్షణలో మాట్లాడుతున్న మనోజ్‌కుమార్

టెక్కలి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్న స్టార్టప్‌లపై విద్యార్థులు దృష్టి సారించే విధంగా అధ్యాపకులు కృషి చేయాలని హైదరాబాద్‌కు చెందిన టెక్నాలజీ డెవలపర్ అండ్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ మెంటార్ మనోజ్‌కుమార్ కోరారు. టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఐఐసీ విభాగం ఆధ్వర్యంలో 'డిజైన్ థింకింగ్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్' అనే అంశంపై సుమారు 5 రోజులు పాటు నిర్వహించనున్న అధ్యాపకుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టార్టప్‌లకు అవసరమైన పూర్తి స్థాయి సందేహాలను నివృత్తి చేయడంతో పాటు సరైన ఆలోచనలను అందజేసే విధంగా శిక్షణ ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం కళాశాల డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ తరగతులను అధ్యాపకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేవలం సర్టిఫికెట్ కోసం కాకుండా విద్యార్థులకు సరైన భవిష్యత్‌ను అందజేసే విధంగా శిక్షణ పొందాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏఎస్ శ్రీనివాసరావు, ఐఐసీ ఇన్‌చార్జి జి.సతీష్‌కుమార్ తో పాటు అధ్యాపకులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుపై కూలిన భారీ చెట్టు



పాతపట్నం-మెళియాపుట్టి మధ్య రోడ్డుమీద పడిన భారీ మర్రిచెట్టు

పాతపట్నం: పాతపట్నం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి ఉరుములతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. ఈదురుగాలులు వీయడంతో మండలంలోని బూరగాం, కాపుగోపాలపురం, పాతపట్నం టీచర్స్ కాలనీల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పాతపట్నం ఆల్‌ఆంధ్ర రోడ్డు డంపింగ్ యార్డు వద్ద భారీ మర్రి చెట్టు ఆర్‌అండ్‌రోడ్డు మీద పడడంతో సోమవారం రాకపోకలు నిలిచిపోయాయి. పాతపట్నం, పలాస ఆర్టీసీ బస్సులు, మెళియాపుట్టి వెళ్లే వాహన రాకపోకలు నిలిచిపోయాయి. ఆర్‌అండ్‌బీ రోడ్డు మీద భారీ మర్రి చెట్టు పడడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అర్‌అండ్‌బీ అధికారులకు స్థానికులు ఫోన్ చేసినా పట్టించుకోలేదు. దీంతో పాతపట్నం, తిడ్డిమి గ్రామ పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అర్‌అండ్‌బీ అధికారులు స్పందించి, రోడ్డు మీద ఉన్న చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

కందిరీగల దాడిలో 12 మందికి గాయాలు



హరిపురం సామాజిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు



కందిరీగల దాడిలో తీవ్ర గాయాలపాలైన దశమయ్య

సోంపేట: మండలంలోని మామిడిపల్లి పంచాయతీ పరిధిలో 12 మంది ఉపాధి హామీ వేతనదారులపై కందిరీగలు సోమవారం దాడి చేశాయి. తోటి వేతనదారులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక కార్జి చెరువులో ఉపాధి పనులు సోమవారం ప్రారంభించారు. జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారంభిస్తుండగా తుప్పల్లో ఉన్న కందిరీగల పట్టు కదిలింది. దీంతో ఒక్కసారి గ్రూపులో 12 మందిపై కందిరీగలు దాడి చేశాయి. దాడిలో కోరిబిల్లి దశమయ్యకు తీవ్రగాయాలు కాగా, కోరిబిల్లి దాలమ్మ, కొర్ల హేమావతి, ఎం.కామేశ్వరి, గేదెల తులసమ్మ, నక్క రెయ్యిమ్మ, పాతిన పార్వతి తదితరులు 12 మందికి గాయాలయ్యాయి. వీరందరినీ స్థానిక ఫీల్డ్ అసిస్టెంట్ నారాయణరావు హుటాహుటిన హరిపురం సామాజిక ఆస్పత్రికి తరలించారు. దశమయ్య పరిస్థితి విషమంగా ఉండడంతో పలాస ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. సాయంత్రానికి అందరూ కోలుకోవడంతో గ్రామస్తులు, ఉపాధి వేతనదారులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానిక సర్పంచ్ పాతిన శేషగిరి, ఎంపీటీసీ దున్న మాదవరావు, గ్రామస్తులు పాతిన రామారావు, సాంర్ర రామారావు పాతిన నాని తదితరులు బాధితులను పరామర్శించారు.

ఫ్లాట్ నంబర్ 101లో మృతదేహం



మృతుడు గంధం రమేష్ (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో కుళ్లిన మృతదేహం కనిపించడం స్థానికంగా కలకలం రేపింది. రెండు రోజుల ముందే ఫ్లాట్ లోపల ఉన్న వ్యక్తి చనిపోయి సోమవారం బయటకు దుర్వాసన రావడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికులు, రెండో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని నెహ్రూవీధి బాలాజీ రెసిడెన్సీలోని 101 ఫ్లాట్‌లో గత కొంతకాలంగా గంధం రమేష్ (48) ఒంటరిగా నివసిస్తున్నాడు. ఇతనికి భార్య అశ్విని, ఓ కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రమేష్ బంగారం పని చేస్తూ బతుకుతున్నాడు. 14 నెలల క్రితం రమేష్‌తో మనస్పర్థలు వచ్చి ఇంటిలో చెప్పకుండా భార్య అశ్విని వెళ్లిపోయింది. దీనిపై రమేష్ రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు కూడా చేశాడు. భార్య వెళ్లిపోవడంతో తీవ్ర మనోవేదనకు గురైన రమేష్ మద్యానికి బానిసయ్యాడు. పిల్లలు ముగ్గురిని ఒడిశా రాష్ట్రం గారబందలో ఉంటున్న అమ్మమ్మ సుగుణ సంరక్షణలో ఉంచాడు.

దుర్వాసన రావడంతో..

గత బుధవారం పెద్ద కుమార్తె రజస్వల ఫంక్షన్ కోసం గారబంద వెళ్లిన రమేష్ శనివారం తిరిగి వచ్చేశాడు. అదే రోజు రాత్రి పూటుగా మద్యం సేవించి ఫ్లాట్‌లో పడుకున్నాడు. సోమవారం ఉదయం రమేష్ నివసిస్తున్న ఫ్లాట్ చుట్టుపక్కల తీవ్రంగా దుర్వాసన రావడంతో అదే అపార్ట్‌మెంట్‌లో ఉంటున్న దేవరాపల్లి శ్రీనివాసరావుకు అనుమానం వచ్చి రమేష్ ఇంటి తలుపులు కొట్టారు. ఎప్పటికీ తలుపులు తీయకపోవడంతో నగరంలోనే మొండేటి వీధిలో నివసిస్తున్న రమేష్ సోదరి రాజమహేంద్రం చిన్నారికి సమాచారం అందించారు. ఆమె వెంటనే వచ్చి తలుపులు బద్దలుగొట్టించి లోపలికి వెళ్లి చూస్తే రమేష్ టవల్ కట్టుకుని అచేతనంగా పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకు విషయం చెప్పగా.. ఎస్ఐ హరికృష్ణ, క్లూస్‌టీమ్ ఘటనాస్థలికి చేరి వివరాలు, ఆధారాలు సేకరించారు. భార్య దూరంగా ఉండటంతో మద్యానికి బానిసై అదే మత్తులో చనిపోయి ఉంటాడనే కోణంలోనే కాక స్థానికుల నుంచి అనేక అంశాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించినట్లు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరికృష్ణ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు



తీవ్రగాయాలతో గుర్తు తెలియని వ్యక్తి

టెక్కలి రూరల్: మండలంలోని రావివలస గ్రామ సమీప రహదారిపై సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి తీవ్రగాయాలతో పడి ఉండటంతో స్థానికులు 108లో టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు స్థానికులు, వైద్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. గాయపడిన వ్యక్తి టెక్కలి నుంచి మద్యం సీసాలు కొనుగోలు చేసి తన నడుము వద్ద ఉంచుకుని తన ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతోనో లేక అదుపు తప్పి పడిపోవడం వల్లనో కింద పడిపోయాడు. దీంతో నడుము వద్ద ఉన్న మద్యం సీసాలు పగలడంతో నడుము కింద భాగంలో తీవ్రగాయాలయ్యాయి.

అటుగా వెళ్తున్న వారు క్షతగాత్రుడిని గుర్తించి అతడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందించారు.